# గలతీయులకు వ్రాసిన పత్రిక 4వ అధ్యాయము

### క్రీస్తునందలి విశ్వాసము ద్వారా కలుగు దైవ కుమారత్వరము

మరియు నేను చెప్పునదేమనగా, వారసుడు అన్నిటికీకర్తయైయున్నను బాలుడై వున్నంతకాలము అతనికిని దాసునికిని ఏ భేదమును లేదు. 2 తండ్రిచేత నిర్ణయింపబడిన దినము వచ్చువరకు అతడు సంరక్షకుల యొక్కయు గృహనిర్వాహకుల యొక్కయు అధీనములో ఉండును. 3 అటువలె మనమును బాలురమై యున్నప్పుడు లోక సంబంధమైన మూలపాఠములకు లోబడిన దాసులమై యుంటిమి 4 అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను 5 ఆయన స్త్రీయందు పుట్టి, మనము దత్తపుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్నవారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను. 6 మరియు మీరు కుమారులై యున్నందున – నాయనా, తండ్రీ, అని మొఱ్ఱపెట్టు తన కుమారుని ఆత్మను దేవుడు మన హృదయములలోనికి పంపెను. 7 కాబట్టి నీవిక దాసుడవు కావు, కుమారుడవే, కుమారుడవైతే దేవుని ద్వారా వారసుడవు.

### విశ్వాసమునుండి వెనుకకు మరల కూడదని పౌలు హెచ్చరిక

8 ఆ కాలమందైతే మీరు దేవుని ఎరుగనివారై, నిజమునకు దేవుళ్లు కానివారికి దాసులై యుంటిరి గాని, 9 ఇప్పుడు మీరు దేవునిని ఎరిగినవారును, మరి విశేషముగా దేవునిచేత ఎరుగబడిన వారునైయున్నారు గనుక, బలహీనమైనవి, నిష్ప్రయోజనమైనవియునైన మూలపాఠములతట్టు మరల తిరుగనేల ? మునుపటివలె మరల వాటికి దాసులైయుండ గోరనేల? 10 మీరు దినములను, మాసములను, ఉత్సవకాలములను, సంవత్సరములను ఆచరించుచున్నారు. 11 మీ విషయమై నేను పడిన కష్టము వ్యర్థమై పోవునేమో అని మిమ్మును గూర్చి భయపడుచున్నాను.

12 సహోదరులారా, నేను మీవంటివాడనైతిని గనుక మీరును నావంటివారు కావలెనని మిమ్మును వేడుకొనుచున్నాను. 13 మీరు నాకు అన్యాయము చేయలేదు. మొదటిసారి శరీరదౌర్బల్యము కలిగినను నేను సువార్త మీకు ప్రకటించితినని మీకు ప్రకటించితినని మీరెరుగుదురు. 14 అప్పుడు నా శరీరములో మీకు శోధనగా ఉండిన దానినిబట్టి నన్ను మీరు తృణీకరింపలేదు, నిరాకరింపనైనను లేదు గాని దేవుని దూతనువలెను, క్రీస్తుయేసునువలెను నన్ను అంగీకరించితిరి. 15 మీరు చెప్పుకొనిన ధన్యత ఏమైనది? శక్యమైతే మీ కన్నులు ఊడబీకి నాకిచ్చివేసి యుందురని మీ పక్షమున సాక్ష్యము పలుకుచున్నాను. 16 నేను మీతో నిజమాడినందున మీకు శత్రువునైతినా? 17 వారు మీ మేలు కోరి మిమ్మును ఆసక్తితో వెంటాడువారు కారు మీరే తమ్మును వెంటాడవలెనని మిమ్మును బయటికి త్రోసివేయ గోరుచున్నారు. 18 నేను మీ యొద్ద ఉన్నప్పుడు మాత్రమే గాక ఎల్లప్పుడును మంచి విషయములో ఆసక్తిగానుండుట యుక్తమే.

19 నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీయందేర్పడు వరకు మీ విషయమై మరల నాకు ప్రసవ వేదన కలుగుచున్నది. 20 మిమ్మును గూర్చి ఎటు తోచక యున్నాను నేనిప్పుడే మీ మధ్యకు వచ్చి మరియొక విధముగా మీతో మాటలాడగోరుచున్నాను.

## పాత నిబంధన నుండొక సాదృశ్యము

21 ధర్మశాస్త్రమునకు లోబడియుండ గోరువారలారా, మీరు ధర్మశాస్త్రము వినుటలేదా? నాతో
చెప్పుడి 22 దాసివలన ఒకడును స్వతంత్రురాలి వలన ఒకడును ఇద్దరు కుమారులు అబ్రాహామునకు
కలిగిరని వ్రాయబడియున్నది గదా ? 23 అయినను దాసివలన పుట్టినవాడు శరీర ప్రకారము పుట్టెను,
స్వతంత్రురాలివలన పుట్టినవాడు వాగ్దానమునుబట్టి పుట్టెను. 24 ఈ సంగతులు అలంకార రూపకముగా
చెప్పబడియున్నవి. ఈ స్త్రీలు రెండు నిబంధనలైయున్నారు  వాటిలో ఒకటి సీనాయి కొండ సంబంధమైనదై
దాస్యములో ఉండుటకు పిల్లలు కనును  ఇది హాగరు. 25 ఈ హాగరు అనునది అరేబియా దేశములో ఉన్న
సీనాయి కొండయే. ప్రస్తుత మందున్న యెరూషలేము దాని పిల్లలతో కూడ దాస్యమందున్నది గనుక ఆ
నిబంధన దానికి దీటయి యున్నది. 26 అయితే పైనున్న యోరూషలేము స్వతంత్రముగా ఉన్నది  అది మనకు
తల్లి. 27 ఇందుకు – కనని గొడ్రాలా, సంతోషించుము. ప్రసవ వేదనపడని దానా, బిగ్గరగా కేకలు వేయుము
ఏలయనగా, పెనిమిటిగలదాని పిల్లలకంటె పెనిమిటిలేనిదాని పిల్లలు ఎక్కువ మంది ఉన్నారు అని
వ్రాయబడియున్నది. 28 సహోదరులారా, మనమును ఇస్సాకువలె వాగ్దానమునుబట్టి పుట్టిన
కుమారులమైయున్నాము. 29 అప్పుడు శరీరమునుబట్టి పుట్టినవాడు ఆత్మనుబట్టి పుట్టినవానిని ఏలాగు
హింసపెట్టెనో, ఇప్పుడును ఆలాగే జరుగుచున్నది. 30 ఇందును గూర్చి లేఖనమేమి చెప్పుచున్నది ? – దాసిని,
దాని కుమారుని వెళ్లగట్టుము, దాసి కుమారుడు స్వతంత్రురాలి కుమారునితోపాటు వారసుడైయుండడు. 31
కాగా సహోదరులారా, మనము స్వతంత్రురాలి కుమారులమే గాని దాసి కుమారులము కాము.